క్లుప్తంగా

అయ్యప్పస్వామికి పూజలు


పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాతశ్రీకాకుళం ధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన అయ్యప్పస్వామికి బుధవారం క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

బింగుపేటలో పశువైద్య శిబిరం


పశువుకు చికిత్స చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ బింగుపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డాక్టర్ సాయిప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది 31 పాడి పశువులకు చికిత్స నిర్వహించారు. మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పాడి రైతులకు అందజేశారు. గొర్రెలు, మేకలకు డీవర్మింగ్ చేశారు.

ఎన్టీఆర్ సెంటనరీ అవార్డుకు డాక్టర్ సంపత్‌కుమార్ ఎంపిక


డాక్టర్ ఇ.ఎస్. సంపత్‌కుమార్

శ్రీకాకుళం కల్చరల్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడకు చెందిన ఎక్స్‌రే సాహితీ సాంస్కృతిక సంస్థ శ్రీకాకుళం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మహతి కన్వీనర్ డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమారను ఎన్టీఆర్ సెంటనరీ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. ప్రజలకు వైద్యసేవలు అందించడం, ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటు, ఆరోగ్యంపై అగాహన కల్పిస్తున్నందుకు గుర్తుగా అవార్డు ప్రకటించారు.

త్వరితగతిన 'నాడు-నేడు' పనులు


మాట్లాడుతున్న సీతంనాయుడు

ఎచ్చెర్ల: నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డీఈ సీతంనాయుడు అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో పనుల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ సూర్యచంద్ర, ఎంఈవో కారు పున్నయ్య, వెలుగు ఏపీఎం రామ్మూర్తి పాల్గొన్నారు.

సృజనాత్మకతను గుర్తించాలి


బొమ్మలు వేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను గుర్తించాల్సిన బాధ్యత బోధకులు, ఉపాధ్యాయులపై ఉందని రచయిత చింతాడ రామారావు అన్నారు. క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని యూటీఎఫ్ భవన్ కార్యాలయంలో జరుగుతున్న చిన్నారుల సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం పెయింటింగ్, డ్రాయింగ్, కథలు, ఆటపాటలు తదతర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు, గొంటి గిరిధర్, పేడాడ జాహ్నవి పాల్గొన్నారు.

నేడు వాండ్రంగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జి.సిగడాం: వాండ్రంగి సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పేదరిక నిర్మూలనే సర్కార్ ధ్యేయం

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- కొత్తపేట గ్రామ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


ప్రజలకు లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కొత్తపేట గ్రామ సచివాలయం పరిధిలోని కోదువానిపేట, సాకివానిపేట, గాడుపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించారు. రేషన్‌కార్డు వారీగా వర్తించిన సంక్షేమ పథకాలను తెలియజేసి బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేత హోదాలో చేసిన ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలను దగ్గరుండీ చూశారన్నారు. జన్మభూమి కమిటీల పెత్తనం, ఒక వర్గానికి ప్రభుత్వ పథకాలు అందటం వంటివి చూసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను, గామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి అర్హునికీ పథకాలను వర్తింపజేస్తున్నట్టు చెప్పారు. కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందజేస్తున్నట్లు వివరించారు. అర్హత ఉన్నవారికి పట్టా అందజేసి ఇంటి యూనిట్ మంజూరు చేసినట్లు చెప్పారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, ఎస్‌ఎం పురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, నాయకులు ప్రజా ప్రతినిధులు బెండు రామారావు, నక్క కృష్ణమూర్తి, బగ్గురాజారావు, బొడ్డేపల్లి సుధాకర్, స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి గజలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గురుగుబెల్లి నర్సింగరావు, పాత్రుని అమర్నాథ్, దుంపల నర్సింగరావు, హౌసింగ్ ఏఈ ఉరిటి రాజేంద్రప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, పీఆర్ ఏఈ సూర్యచంద్ర, వ్యవసాయ అధికారి సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే


వేతనదారులుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: మండలంలోని నేతేరు గ్రామంలోని జగన్నాథ చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులు చేస్తున్న చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని వేతనదారులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించి ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి మౌలిక సదుపాయాలు సమకూర్చాలని ఆదేశించారు. రెండు పూటలా పనులు చేయాలని వేతనదారులకు సూచించారు. ఏఎంసీ డైరెక్టరు గొర్లె శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు ఉన్నారు. అనంతరం కేశవరాయునిపాలెం పంచాయతీ సర్పంచ్ యాగాటి వెంకటమ్మ మామ, పార్టీ నాయకుడు ఆదినారాయణ తండ్రి ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెండడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

సీఎం జగన్ పాలన భేష్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నాలుగేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన భేష్ అనిపించుకుందని మాజీ ఎంపీ డాక్టర్ డీపీజీ శంకరరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను 90 శాతం నెరవేర్చి దేశ చరిత్రలో రికార్డుగా నిలిచిపోయిందన్నారు. జాతీయ ర్యాంకింగ్స్‌లో ప్రగతి కనిపించడం అభినందనీయమన్నారు. పలు రాష్ట్రాలు మన రాష్ట్రంలోని పాలనా విధానాన్ని మెచ్చి అనుకరించడం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. నాలుగేళ్లలో సగభాగం కరోనా మహమ్మారి వెంటాడినప్పటికీ ధైర్యంగా ఎదుర్కొన్నారన్నారు. విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేశారన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్.ఎం.పురం రెవెన్యూ పరిధి ఫరీదుపేట సర్వే నంబర్ 508/7లోని భూమిలో రెవెన్యూ అధికారులు బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. భూముల ఆక్రమణపై స్పందనలో వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. నాలుగు సెంట్లు రియల్ ఎస్టేట్‌కు చెందిన రిజర్వు స్థలంగా గుర్తించారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి, రెవెన్యూ అధికారి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు అక్రమణలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ మాయమాటలు నమ్మవద్దు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్‌మనోహర్ నాయుడు


లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందజేస్తున్న రామ్‌మనోహర్ నాయుడు

గార: టీడీపీ నాయకుల మాయమాటలను నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. బలరాంపురం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలన్నీ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచసర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బలరాంపురం పంచాయతీలో మత్స్యకార భరోసా కింద నాలుగేళ్లలో కోటి రూపాయలు అందజేసినట్టు పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, అంబటి శ్రీనివాసరావు, మత్స్యకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు, కోనాడ నర్సింహులు, పీస శ్రీహరిరావు, పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కోట రామారావు, కొయ్యాన నాగభూషణం, గొండు జయరాం, గొలివి వెంకటరమణమూర్తి, పప్పు పోలీసు, గనగళ్ల రామారావు, తెనుకోటి అప్పారావు, శిమ్మ ధర్మరాజు, యాళ్ల నారాయణమూర్తి, మార్పు పృథ్వీరాజ్, రుప్ప శ్రీనివాసరావు, అంబటి చినబాబు, సుంకాన సురేష్ పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ


గార: శీర కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


జి.సిగడాం: పరామర్శలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

గార: రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేట గ్రామానికి చెందిన శీర రాము ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతిని తెలియజేశారు. అలాగే శిమ్మపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శీర ప్రభాకరరావు దంపతులు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో వారిని కూడా పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీనివాసరావు, అంబటి చినబాబు, గొలివి గోవిందరావు, శిమ్మ ఆదినారాయణ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

జి.సిగడాం: పాలఖండ్యాం వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ది భాస్కరరావు అల్లుడు బాలబొమ్మ రమణరావు సంతవురిటి గ్రామంలో ఇటీవల మృతి చెందారు. దీంతో ఈయన కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణలు సంతవురిటి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. వీరి వెంట పలువురు నాయకులున్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం అవసరం


డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న అధికారులు

రణస్థలం: వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం అవసరమని జిల్లా వ్యవసాయ అధికారి కె. శ్రీధర్ అన్నారు. పైడిభీమవరం పంచాయతీ పరిధి వరిసాం గ్రామంలో నాగిరెడ్డి రామకృష్ణకు చెందిన రెండెకరాల వేరుశనగ పొలంలో గరుడ ఏరోస్పేస్ వారి డీజీసీఏ సర్టిఫైడ్ డ్రోన్‌తో పురుగుల మందులు పిచికారీ ప్రదర్శన క్షేత్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. పంటలలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉండటం వలన పురుగు మందులు పిచికారీ అనేది అధిక ఖర్చుతో కూడుకున్న అంశంగా మారిందన్నారు. అందువలన డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీరి చేయడం వలన తక్కువ నీటి వినియోగంతో పురుగు మందును సరైన మొతాదులో ప్రభావంతంగా వినియోగించుకోవచ్చునన్నారు. డ్రోన్ వాడకం వలన సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో రణస్థలం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాస్, ఏవో డి.విజయభాస్కర్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు, సహాయ మేనేజర్ పి.తవిటినాయడు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులకు సత్కారం


ఎచ్చెర్ల క్యాంపస్: సత్కారం పొందిన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు, అధికారులు


శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మొదలవలన చిరంజీవి గ్రామ వలంటీర్లను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయడంలో వలంటీర్ల సేవలు కీలకమని అభినందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, సర్పంచ్ డొంక ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రోజారాణి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

☛ శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మహాలక్ష్మీనగర్ కాలనీ, మండలవీధికు చెందిన పలువురు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో 23, 24 డివిజన్ల పార్టీ కన్వీనర్లు పాల్గొన్నారు.

☛ గార: వలంటీర్ల సేవలకు వెలకట్టలేమని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. బుధవారం సాయంత్రం అంపోలు సచివాలయం పరిధిలోని వలంటీర్లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కిందిస్థాయికి ప్రభుత్వ సేవలందించేకు ఏర్పాటైన వలంటీరు వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తుందన్నారు. పింఛన్ల పంపిణీ నుంచి లబ్ధిదారుల వివరాలు సేకరించడం, నిత్యం తనకు కేటాయించిన కుటుంబాల సమస్యలు తెలుసుకోవడం, కోవిడ్ వంటి భయంకరమైన పరిస్థితుల్లో కూడా పని చేశారన్నారు. మూడు సచివాలయ పరిధిలోని వలంటీర్లను దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, ఎంపీటీసీ సభ్యుడు పాదిలాపు రామజోగి ఉన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి


నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మానవత్వంతో చేసిన సేవలే సమాజంలో గుర్తింపునిస్తాయని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ ఆధ్వర్యంలో సినీనటుడు శరత్‌బాబు, ఎన్‌ఈఆర్ ఎక్సలెన్స్ స్కూల్ అధినేత నడుకుదిటి ఈశ్వరరావు తండ్రి అప్పలకొండ దొరలకు బుధవారం సంతాప సభ నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో పుట్టి తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించి పేరు ప్రఖ్యాతలు తెచ్చిన శరత్ బాబు మరణం తీరనిలోటన్నారు. శరత్‌బాబు క్రమశిక్షణ కలిగిన నటుడిగా సినీ వర్గాల్లో మంచి పేరు ఉందన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు, వ్యవస్థాపక అధ్యక్షులు ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి


లావేరు: క్రీడలపై అవగాహన కల్పిస్తున్న రమాదేవి


ఎచ్చెర్ల: మాట్లాడుతున్న చంద్రశేఖరరావు


శ్రీకాకుళం అర్బన్: పత్రికలను చదువుతున్న విద్యార్థులు


శ్రీకాకుళం అర్బన్: వారసత్వ ప్రదేశాల చిత్రపటాలు చూపుతున్న చిన్నారులు

లావేరు: క్రీడలపై విద్యార్థులు దృష్టి సారించాలని రిసోర్సుపర్సన్ ఎ.రమాదేవి అన్నారు. మురపాక గ్రామంలోని శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం క్రీడల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు వస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

జల వనరులను కాపాడుకోవాలి

ఎచ్చెర్ల: సమస్త జీవకోటికి నీరు ప్రధానమని అందువలన జల వనరులను కాపాడుకోవాలని ధర్మవరం శాఖా గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు అన్నారు. నీటి అవసరం, ప్రాధాన్యతపై గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలన్నారు. గ్రంథాలయ సహాయకుడు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

☛ శ్రీకాకుళం అర్బన్: చిన్నప్పటినుంచే విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకుని అందుకు అనుగుణంగా చదవాలని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో ఆయన మాట్లాడారు. పిల్లలతో పత్రికలను చదివించారు. కార్యక్రమంలో బలగ గ్రంథాలయ సహాయకరాలు కె.అనిత పాల్గొన్నారు.

☛ ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో చిన్నారులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి ఎం.నీలమ్మ పాల్గొన్నారు.

☛ శ్రీకాకుళం అర్బన్: మనదేశ వారసత్వ నగరాలు, ప్రదేశాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయుడు లావేటి కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారసత్వ నగరాలపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. ఉపాధ్యాయురాలు టి.ఎర్రమ్మ పొదుపు కథలు, కవితలు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.భానుమతి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా పనిచేయాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జోన్ జోనల్ ట్రైనర్‌లు దూసి సంతోష్, జేసీ జీవనజ్యోతిలు అన్నారు. జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్ ఆధ్వర్యంలో నేషనల్ ట్రైనింగ్ డే సందర్భంగా బుధవారం శ్రీకాకుళం సన్‌రైజర్స్ సభ్యులకు, శ్రీకాకుళంలోని గొలివి ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవటానికి అద్భుతమైన వేదిక జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ అన్నారు. ఇందులో సభ్యులుగా చేరాలని కోరారు. జేసీఐ సన్‌రైజర్స్ సెక్రటరీ జేసీ సువ్వారి సతీష్, జేసీలు శిరీష, మాధనిక, ప్రవీణ్ పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి లక్ష్యాలు సాధిస్తాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూమిలేని పేదలకు భూమి కేటాయింపునకు సంబంధించిన ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి పూర్తవుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. అసైన్డ్ భూముల పంపిణీ, మ్యూటేషన్లు, ఓ.టి.సి, వాటర్ ట్యాక్స్ తదితర అంశాలపై భూపరిపాలన శాఖ జాయింట్ సెక్రటరీ ప్రభాకర రెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాలలో అసైన్డ్ భూముల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల సమస్యలు పరిష్కరించాలని వినతి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన బదిలీల ప్రక్రియలో భాషోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగనాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో ఎస్.తిరుమల చైతన్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 98 కంటే తక్కువ రోల్ ఉన్న కారణంగా బదిలీకి గురైన భాషోపాధ్యాయులకు రీఅపోర్షన్ పాయింట్లు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ యాజమాన్యంలో భాషా పండిత పోస్టులు లేని కారణంగా బదిలీలకు ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులు ఖాళీలు చూపించాలని అభ్యర్థించారు. నోషనల్ సీనియారిటీ మంజూరైన డీఎస్సీ 2002 హిందీ పండితులకు నోషనల్ తేదీ నుంచీ సర్వీసు పాయింట్లు మంజూరు చేయాలని విన్నవించారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా సహాధ్యక్షుడు కుప్పన్నగారి శ్రీనివాసరావులు, సంయుక్త కార్యదర్శి గొడబ మేరీ ప్రసాద్, జి.వినయ్‌కుమార్, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.వెంకటరమణ ఉన్నారు.

అన్నపూర్ణ సేవా పథకానికి నీటి ట్యాంకు బహూకరణ


ట్యాంకును అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయి సేవా సంస్థ నిర్వహిస్తున్న సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా పథకానికి మంచినీటి ట్యాంకును బుధవారం బహూకరించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నారాయణశెట్టి చక్రపాణి, లావణ్య దంపతులు, కుటుంబసభ్యులు కలసి రూ.20 వేల విలువైన ట్యాంకును రిమ్స్ అన్నపూర్ణ ట్రస్టు అధ్యక్షుడు గంగుల రమణబాబుకు అందించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు, రిమ్స్ అన్నపూర్ణ సేవా సభ్యులు లోలుగు నూకరాజు, నారాయణశెట్టి మోహన్, రత్నం పాల్గొన్నారు.